
పాడేరులో స్పందన కార్యక్రమం రేపు

పాడేరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఈ నెల 12న స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు వారాలుగా ఐటీడీఏలో నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని, ఈ వారం నిర్వహిస్తామన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమ సమస్యలపై అర్జీలను స్పందనలో సమర్పించాలన్నారు. అలాగే వివిధ శాఖలకు చెందిన అధికారులు శుక్రవారం ఉదయం పది గంటలకే ఐటీడీఏ కార్యాలయానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

సర్కారు బెదిరింపుల పర్వం!

ఎస్మా ప్రయోగానికి లొంగకపోవడంతో అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు



పాడేరులోని తలారిసింగి అంగన్‌వాడీ కేంద్రానికి అతికించిన షోకాజ్ నోటీసు

కొందరి ఇళ్లకు అతికిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మరి కొందరికి పోస్టల్ ద్వారా బట్వాడా

సమ్మె విరమించే ప్రసక్తే లేదంటున్న కార్యకర్తలు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

తమ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌పై సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను బెదిరించేందుకు వైసీపీ ప్రభుత్వం మరో మార్గాన్ని ఎంచుకుంది. ఈ నెల ఎనిమిదో తేదీ నాటికి విధుల్లో చేరకుంటే ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తామని బెదిరించినా అంగన్‌వాడీలు వెనక్కి తగ్గకపోవడంతో తాజాగా తొమ్మిదో తేదీ నుంచి వారికి వ్యక్తిగతంగా షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నది.



షోకాజ్ నోటీసుల జారీపై పాడేరులో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలు అన్ని ప్రాంతాల్లోనూ సమ్మె కొనసాగిస్తూ, మండల కేంద్రాల్లో నిరసన శిబిరాల్లో ఉంటున్నారు. దీంతో ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీల ఇళ్లకు వెళ్లి షోకాజ్ నోటీసులను అతికిస్తున్నారు. మండల కేంద్రాలు, పరిసర గ్రామాల్లోని ఇళ్లకు షోకాజ్ నోటీసులు అతికిస్తుండగా, మారుమూల ప్రాంతాలకు పోస్టల్ ద్వారా నోటీసులు పంపించారు. పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలనే డిమాండ్‌పై అంగన్‌వాడీలు సమ్మె చేపడుతుండడం, వారి అనుమతి లేకుండా అంగన్‌వాడీ కేంద్రాలను స్వాధీనం చేసుకోవడం, సచివాలయ సిబ్బంది ద్వారా వాటిని నిర్వహించాలని ప్రయత్నించి విఫలం కావడం, సమీపంలోని పాఠశాల్లోని మధ్యాహ్న భోజన నిర్వాహకులతో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలని ప్రయత్నించి మరోమారు విఫలమైన సంగతి తెలిసిందే. కాగా ఈ నెల ఐదో తేదీలోగా కచ్చితంగా విధుల్లో




లగిశపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్త ఇంటి వద్ద నోటీసు

చేరాలని కలెక్టర్‌లతో అంగన్‌వాడీలకు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేయించారు. అయినప్పటికీ అంగన్‌వాడీలు పట్టు వదలకుండా సమ్మెను కొనసాగిస్తుండడంతో తాజాగా ఎస్మా చట్టాన్ని ప్రయోగించారు. రానున్న ఆరు నెలలు అంగన్‌వాడీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎటువంటి ఆందోళనలను, నిరసనలు చేపట్టకూడదని, విధుల్లో ఉండాలని ప్రభుత్వం హెచ్చరించింది.

అయితే ఆఖరికి ఎస్మా ప్రయోగాన్ని సైతం అంగన్‌వాడీలు పట్టించుకోకుండా తమ సమ్మెను మరింత పట్టుదలతో కొనసాగిస్తున్నారు. దీంతో మరింత మొండిగా వ్యవహరించాలని భావించిన వైసీపీ ప్రభుత్వం ఎస్మాను విస్మరించినందుకు గానూ గత రెండు రోజులుగా అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులను జారీ చేయడం మొదలు పెట్టింది. ప్రభుత్వం సూచించిన విధంగా ఈ నెల ఎనిమిదో తేదీన ఎందుకు విధుల్లో చేరలేదో? వివరంగా పేర్కొనాలని షోకాజ్ నోటీసు ద్వారా కోరారు. షోకాజ్ నోటీసులు అందుకున్న అంగన్‌వాడీలు సదరు నోటీసులకు అధికారులు సంతృప్తి చెందేలా సమాధానం ఇవ్వకపోతే వారిపై శాఖాపరమైన చర్యలు చేపడతామని ... **మిగతా 6వ పేజీలో..**

రోడ్డు అంచులు ఘోరం ప్రయాణం ప్రమాదకరం





పాడేరు-జోలాపుట్టు మెయిన్‌రోడ్డులో గబ్బంగి వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు అంచులు

పాడేరు-జోలాపుట్టు మెయిన్‌రోడ్డులో దుస్థితి

రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

పాడేరు నుంచి పెదబయలు, ముంచంగిపుట్టు, జోలాపుట్టు ప్రాంతాలకు వెళ్లే మెయిన్‌రోడ్డులో అంచులు అధ్వానంగా ఉండడంతో ఆ మార్గంలో ప్రయాణమంటే వాహనచోదకులు భయపడుతున్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

పాడేరు నుంచి పెదబయలు, ముంచంగిపుట్టు మీదుగా జోలాపుట్టు ప్రాంతానికి వెళ్లే మార్గంలో పలు చోట్ల రోడ్డు అంచులు ఘోరంగా ఉన్నాయి. ప్రధానంగా మండలంలో చింతలవీధి ప్రాంతం నుంచి సుమారుగా ఐదు కిలోమీటర్ల వరకు అంటే గుత్తులపుట్టు వరకు ఉన్న మార్గంలో ఇరు వైపులా రోడ్డు అంచులు కోతకు గురయ్యాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనానికి దారి ఇవ్వలేని దుస్థితి. ఈ క్రమంలో ఎదురెదురుగా వాహనాలు వస్తే ఏమవుతుందోననే ఆందోళనతో వాహన చోదకులు భయపడుతున్నారు. అలాగే ప్రమాదాలు సైతం అధికంగానే జరుగుతున్నాయి. ఈ మార్గంలో ఆటోలు, బైక్‌లు నిత్యం ఢీకొట్టుకుంటుండగా, అప్పుడప్పుడు భారీ వాహనాలు, కార్లు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఉదాహరణకు పాడేరు- జోలాపుట్టు మెయిన్ రోడ్డులో మండలంలో చింతలవీధి వద్ద రోడ్డు అంచులు బాగోని కారణంగా గతేడాది జీపు బోల్తాపడి ఒక టీచర్ మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు అంచుదిగిన జీపు మళ్లీ రోడ్డుపైకి ఎక్కే క్రమంలో బోల్తా పడింది. వాస్తవానికి రోడ్డు అంచులు సక్రమంగా ఉంటే రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడకపోవడంతోపాటు ప్రమాదాలు తగ్గుతాయని డ్రైవర్లు అంటున్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధుల్లేకే ఈ పరిస్థితి

రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడంతో ప్రధాన రోడ్లు సైతం బాగోకపోయినా కనీస మరమ్మతులు చేయించలేని దుస్థితి కొనసాగుతున్నది. ఈ క్రమంలోనే పాడేరు- జోలాపుట్టు మెయిన్‌రోడ్డు అంచులు పాడైనా మరమ్మతులు చేయలేని పరిస్థితి ఏర్పడిందని స్పష్టమవుతున్నది. వాస్తవానికి పాడేరు- జోలాపుట్టు మెయిన్‌రోడ్డు ఆంధ్రా, ఒడిశా రవాణాకు ఎంతో ముఖ్యమైనది. పాడేరు, పరిసర ప్రాంతాల నుంచి పెదబయలు, ముంచంగిపుట్టు, జోలాపుట్టు ప్రాంతాలకు రాకపోకలతో పాటు మైదాన ప్రాంతం నుంచి ఒడిశా రాష్ట్రానికి జరిగే మొత్తం రాకపోకలు ఈ మార్గంలోనే జరుగుతాయి. దీంతో ఏజెన్సీలో పాడేరు- జోలాపుట్టు మెయిన్‌రోడ్డు ఎంతో ముఖ్యమైనది. అటువంటి రోడ్డు అంచులు బాగోకపోయినా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు, డ్రైవర్లు మండిపడుతున్నారు.

విహారంలో విషాదం

రోడ్డు రోలర్‌ను ఢీకొన్న బైక్

ఇద్దరు డిగ్రీ విద్యార్థులు మృతి

అరకులోయ నుంచి పాడేరు వెళుతుండగా ప్రమాదం

మృతులిద్దరూ సాలూరు మండలం నడిమివలస వాసులు

అరకులోయ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మన్యంలో పర్యాటక ప్రదేశాలను తిలకించేందుకు వచ్చిన ఇద్దరు డిగ్రీ విద్యార్థులు బుధవారం సాయంత్రం డుంబ్రిగుడ మండలం కురిడి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. మృతులు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం నడిమివలస గ్రామానికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం...నడిమివలస గ్రామానికి చెందిన పీదరపు రవితేజ (20), మెలిక వాసు (20)లు విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు కాలేజీలో డిగ్రీ చదువుతున్నారు. విహారయాత్రకని రవితేజ, వాసులు మరో నలుగురు తోటి విద్యార్థులతో కలిసి మూడు బైక్‌లపై బుధవారం అరకులోయ చేరుకున్నారు. ఇక్కడ సందర్శనీయ ప్రదేశాలను తిలకించి రాత్రికి పాడేరు చేరుకుని, అక్కడ బస చేసి గురువారం తెల్లవారుజామున వంజంగి హిల్స్‌కు వెళ్లాలని భావించారు. ఇందులో భాగంగా పగలంతా అరకులోయ చుట్టుపక్కల ప్రాంతాలను చూసి సాయంత్రం పాడేరు బయలుదేరారు. ఈ క్రమంలో డుంబ్రిగుడ మండలం కురిడి వద్ద నిలిచివున్న రోడ్డు రోలర్‌ను రవితేజ, వాసు ప్రయాణిస్తున్న బైక్ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రవితేజ అక్కడికక్కడే మృతిచెందగా, వాసుకు తీవ్రగాయాలు కావడంతో అరకులోయ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులు విహారయాత్రకు వచ్చి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో విషాదం చోటుచేసుకుంది. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





మృతి చెందిన మెలిక వాసు, పీదరపు రవితేజ (ఫైల్ ఫొటోలు)


దూడూ బసవన్నల సందడి

సంక్రాంతి వేడుకల్లో భాగంగా సందడి చేసే గంగిరెద్దులు ఏజెన్సీలో ముందుగానే దర్శనమిస్తున్నాయి. గంగిరెద్దులు మైదాన ప్రాంతంలో మాత్రమే ఉంటాయి. అయితే మన్యంలో ఈ సారి గంగిరెద్దులు దర్శనమివ్వడంతో వాటిని అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు. కొందరు భక్తులు వాటికి పూజలు చేస్తూ, వాటి యజమానులకు కానుకలు ఇస్తున్నారు.

-ఆంధ్రజ్యోతి/పాడేరు



పాడేరు మోదమాంబ కాలనీలో గంగిరెద్దుల సందడి



రన్‌వేపై చంద్రబాబునాయుడుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే గణబాబు

చంద్రబాబుకు స్వాగతం

విశాఖపట్నం, జనవరి 10: 'రా...కదలిరా...' పేరుతో విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఏర్పాటుచేసిన సభలో పాల్గొనడానికి విచ్చేసిన తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడుకు బుధవారం విశాఖ పట్నం విమానాశ్రయంలో పార్టీ నాయకులు స్వాగతం పలికారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లకు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు విమానాశ్రయంలోని రన్‌వేపై స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు, లోకేశ్‌లు హెలికాప్టర్‌లో బొబ్బిలి బయలుదేరి వెళ్లారు.

మళ్లీ మొరాయించిన బస్సు

అరడకోట- చుట్టుమెట్ట మధ్యలో నిలిచిపోయిన పాడేరు డిపో బస్సు

ప్రయాణికులకు తప్పని పాట్లు... గంట సేపు రోడ్డుపై నిరీక్షణ

ప్రైవేటు వాహనాలకు అధిక చార్జీ చెల్లించి గ్రామాలకు పయనం

ఏజెన్సీలో డొక్కు బస్సులను నడుపుతున్నారని ఆగ్రహం

పెదబయలు, జనవరి 10: పాడేరు డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సులు ఎక్కడబడితే అక్కడ నిలిచిపోయి ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. యాజమాన్యం కాలం చెల్లిన డొక్కు బస్సులను నడపడం వల్ల అవి నడవలేక మార్గమధ్యంలో నిలిచిపోయి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

పాడేరు నుంచి ముంచంగిపుట్టు మీదుగా మారుమూల గ్రామాలకు వెళ్లే కుమడ బస్సు అరడకోట- చుట్టుమెట్ట మధ్యలో సాంకేతిక లోపం వల్ల బుధవారం మధ్యాహ్నం ఆగిపోయింది. విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో స్వగ్రామాలకు బయలుదేరగా, బస్సు నిలిచిపోవడంతో అవస్థలు పడ్డారు. మారుమూల గ్రామాలకు వెళ్లే ఒకే ఒక్క బస్సు ఇది కావడంతో స్వగ్రామాలకు వెళ్లే అవకాశం లేక అసహనం వ్యక్తం చేశారు. పాడేరు డిపో నుంచి కాలం చెల్లిన, కండిషన్‌లో లేని బస్సులను నడపడం వల్ల నిత్యం అవి మొరాయిస్తున్నాయని ప్రయాణికులు మండిపడుతున్నారు. కుమడ, బూసిపుట్టు, జామిగూడ పంచాయతీల్లోని పలు గ్రామాలకు వెళ్లే గిరిజనులు సుమారు గంట సేపు రోడ్డుపై నిరీక్షించి పెదబయలు వరకు మరో బస్సులో వెళ్లి అక్కడి నుంచి ప్రైవేటు వాహనాలకు అధిక నగదు చెల్లించి తమ గ్రామాలకు చేరుకున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి కండిషన్‌లో ఉన్న బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్సు మొరాయించడంతో రోడ్డుపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు

భద్రాచలం బస్సు వేళల్లో మార్పు

పాడేరురూరల్: పాడేరు పీటీడీ డిపోనకు చెందిన అరకు- భద్రాచలం బస్సు వేళల్లో మార్పులు చేపట్టామని డిపో మేనేజర్ వి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు రోజూ ఉదయం 6.30 గంటలకు పాడేరులో బయలుదేరి అరకుకు 7.30 గంటలకు చేరుకుంటుందన్నారు. అక్కడ 8 గంటలకు బయలుదేరి 9 గంటలకు పాడేరు చేరుకుంటుందన్నారు. పాడేరు నుంచి 9.30 గంటలకు బయలుదేరి చింతపల్లి, సీలేరు మీదుగా భద్రాచలానికి సాయంత్రం 6.30 గంటలకు చేరుకుంటుందన్నారు. రాత్రి అక్కడే ఉండి భద్రాచలంలో మరుసటి రోజు ఉదయం 7.30కు బయలుదేరి సీలేరు, చింతపల్లి మీదుగా పాడేరు కాంప్లెక్స్‌కు సాయంత్రం 4.15 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ వేళల మార్పును గమనించాలని కోరారు.



పాడేరు-చింతపల్లి మెయిన్‌రోడ్డులో బుధవారం ఉదయం పొగ మంచు

కొనసాగుతున్న చలి

జి.మాడుగులలో 10.9, అరకులోయలో 11, పాడేరు, చింతపల్లిలో 11.7 డిగ్రీలు

పాడేరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నప్పటికీ గత కొన్ని రోజులుగా చలి తీవ్రత, పొగమంచు కొనసాగుతున్నది. బుధ వారం జిమాడుగులలో 10.9, అరకులోయలో 11, జీకేవీధిలో 11.3, పాడేరు, చింతపల్లిలో 11.7 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు బుధవారం నమోదయ్యాయి. శీతాకాలం నేపథ్యంలో మరికొన్ని రోజులు చలి వాతావరణం కొనసాగే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ సూచిస్తున్నది. మన్యంలో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టంగా పొగ మంచు కురుస్తున్నది. దీంతో ఏజెన్సీలో రోడ్లు స్పష్టంగా కనిపించకపోవడంతో హెడ్ లైట్లు వేసుకుని వాహనచోదకులు రాకపోకలు సాగిస్తున్నారు. మధ్యాహ్నం వేళలో ఒక మోస్తరుగా మాత్రమే ఎండ కాస్తూ, సాయంత్రం మూడు గంటల నుంచే చలి ప్రభావం మొదలవుతున్నది. దీంతో ఏజెన్సీ వాసులు చలి మంటలు కాగుతూ, ఉన్ని దుస్తులు ధరిస్తూ చలి నుంచి రక్షణ పొందుతున్నారు.

జీకేవీధి, చింతపల్లిలో..

చింతపల్లి: మన్యంలో చలి తీవ్రత కొనసాగుతోంది. బుధవారం గిరిజన ప్రాంతంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. జీకేవీధిలో 11.3, చింతపల్లిలో 11.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. చలి తీవ్రత పెరగడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గిరిజన గ్రామాల్లో మంచు దట్టంగా కురుస్తున్నది. లంబసింగి, చింతపల్లి, జీకేవీధి, తాజంగి ప్రాంతాల్లో ఉదయం పదిన్నర గంటల వరకు మంచు వీడడం లేదు.



నిందితులతో అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ అప్పలసూరి

బాలికపై అత్యాచారం కేసులో ఇద్దరి అరెస్టు

గూడెంకొత్తవీధి మండలంలోని ఒక గిరిజన గ్రామంలో పదకొండేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు.

-వార్త 7వ పేజీలో..

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ అడ్మిషన్‌లకు గడువు పెంపు

పాడేరు రూరల్, జనవరి 10: జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం-128 ద్వారా అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీలలో అడ్మిషన్ పొందేందుకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పెంచినట్టు ప్రిన్సిపాల్ వనుము చిట్టిబ్బాయి తెలిపారు. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, పాలిటెక్నిక్, ఓపెన్ ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. అడ్మిషన్‌లు పొందిన విద్యార్థులు కళాశాల అధ్యయన కేంద్రంలో పరిశీలన చేయించుకోవాలని అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ ఎ.మురళీధరరావు తెలిపారు. అనంతరం అడ్మిషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. అడ్మిషన్ కోసం విద్యార్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్ మార్కుల జాబితా, ఆధార్, రెండు పాస్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 9490458695, 7382929720 నంబర్లకు సంప్రదించాలన్నారు.

క్షయ బాధితులకు పోషకాహార కిట్లు



క్షయ బాధితులకు కిట్‌ను అందజేస్తున్న వైద్యాధికారి

చింతపల్లి, జనవరి 10: క్షయ బాధితులకు పోషకాహార కిట్లు పంపిణీ చేసినట్టు లోతుగెడ్డ వైద్యాధికారి లక్ష్మీకాంత్ తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో క్షయ బాధితులకు బుధవారం పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ బాధితులకు స్వచ్ఛంద సంస్థలు సమకూర్చిన పోషకాహార కిట్లు కొంత కాలంగా అందజేస్తున్నామన్నారు. తాజాగా ఈఏఎస్‌పీఎల్ సంస్థ చింతపల్లి మండలానికి చెందిన 16 మంది బాధితులకు నెలకు సరిపడా పోషకాహార కిట్లను అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జానకి, ఎంపీహెచ్ఈవో గుల్లెలి సింహాద్రి, క్షయ పర్యవేక్షకుడు ప్రసాద్ పాల్గొన్నారు.

ఆడపడుచుల సమస్యలు పట్టని ప్రభుత్వం

- రాజధాని లేకుండా చేసిన జగన్ రాష్ట్రానికి అవసరమా?
- సీఐటీయూ జిల్లా ప్రతినిధి సుందరరావు
- మన్యంలో కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె.. నిరసనలు





పాడేరులో ప్ల కార్డులతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు.. చింతపల్లిలో ముసుగు వేసుకుని అంగన్‌వాడీల ర్యాలీ

పాడేరు రూరల్, జనవరి 10: డిమాండ్ల సాధనకు 30 రోజులుగా సమ్మె బాట పట్టి రోడ్డున పడ్డ అంగన్‌వాడీ ఆడపడుచుల సమస్యలు వైసీపీ ప్రభుత్వానికి పట్టకపోవడం విచారకరమని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుందరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మన్యంలో అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. పాడేరు శిబిరాన్ని బుధవారం సుందరరావు సందర్శించి అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికార దాహంతో ఉన్న జగన్‌రెడ్డి తల్లిని, చెల్లినే ఆడవారని ఆలోచించకుండా పక్కకు నెట్టిన ఘనుడన్నారు. ఎస్మా చట్టంతో, షోకాజ్ నోటీసులతో ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించడం జగన్‌రెడ్డి నీచ పాలనకు నిదర్శనమన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేవరకు ఎన్ని ఇబ్బందులైనా ఎదుర్కొంటారన్నారు. మండలంలోని వంచెడిగొంది కేంద్రం హెల్పర్ కుమారికి చెయ్యి విరిగినప్పటికీ చిన్నారితోనే సమ్మె శిబిరంలో పాల్గొన్నారన్నారు. ఇంత దయనీయంగా అంగన్ వాడీలు పోరాడుతున్నా ప్రభుత్వానికి చలనం లేకపోవడం విచారకరమని వాపోయారు. అలాగే రాజధాని లేకుండా చేసిన సీఎం జగన్ రాష్ట్రానికి అవసరమా అని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జిల్లా నాయకులు భాగ్య, చిన్నారి, దేవి, ఇందిర, జయ, విజయ, భారతి, విమల, కుమారి, సత్యవతి, అంబిక, ఛాయాదేవి పాల్గొన్నారు.

ఎస్మాను రద్దు చేయాలి: పెంటమ్మ

చింతపల్లి: అంగన్‌వాడీ కార్యకర్తలపై ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు పెంటమ్మ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్మా చట్టానికి వ్యతిరేకంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ముసుగు వేసుకుని మండల కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుకు చేయాలని పలుమార్లు ప్రభుత్వానికి అర్జీలు అందజేశామన్నారు. సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో పాటు కార్యకర్తల సమ్మెను బలవంతంగా రద్దు చేసేందుకు కుట్ర చేసిందన్నారు. చిరు ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తుంటే ఎస్మా ప్రయోగించడం చాలా అన్యాయమన్నారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ ప్రతినిధి రాములమ్మ, మధ్యాహ్న భోజన పథకం జిల్లా కమిటీ సభ్యురాలు లక్ష్మి పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో థింసా నృత్యంతో అంగన్‌వాడీల నిరసన

థింసా నృత్యాలతో నిరసన

డుంబ్రిగుడ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె 30వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు సమీప జాతీయ రహదారిలో గిరిజన సంప్రదాయ నృత్యాన్ని థింసా ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, వివిధ ప్రజా, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధిలో..

గూడెంకొత్తవీధి: అంగన్‌వాడీ కార్యకర్తలపై వైసీపీ ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని టీడీపీ మహిళా నాయకురాలు ముక్కలి కల్యాణి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపడుతున్న దీక్షా శిబిరానికి వెళ్లి ఆమె మద్దతిచ్చారు. ప్రభుత్వం, సీఎం జగన్ స్పందించి అంగన్‌వాడీల ఆందోళనలకు ముగింపు పలుకుతూ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు గడుతూరి సత్యనారాయణ, వర్కర్స్ యూనియర్ నాయకులు అప్పలనర్స, సత్యవతి పాల్గొన్నారు.

యువత ఆలోచన పక్కదారి పట్టించడానికే 'ఆడుదాం-ఆంధ్ర'

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్

కొయ్యూరు, జనవరి 10: అధికారం చేపట్టిన ఐదేళ్ల కాలంలో యువతకు చేసిందేమీ లేక వారి నుంచి వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుందనే భయంతోనే ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమానికి ప్రభుత్వం పూనుకుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్ అన్నారు. కొయ్యూరులో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ యువత ఆలోచనను పక్కదారి పట్టించడానికే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని చెప్పారు. వైసీపీ నిరంకుశ విధానాలపై యువశక్తి ఉద్యమిస్తుందని పసిగట్టి ఈ నాటకానికి తెరతీసిందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో గిరిజనులు సంఘటితంగా వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. ఎన్నికల ముందు జాబ్ క్యాలండర్, గిరిజన డీఎస్సీ అంటూ ప్రగల్భాలు పలికిన జగన్, ఈ ఐదేళ్లలో యువతకు కనీస ఉపాధి చూపలేకపోవడమే కాకుండా వలసలు వెళ్లేలా చేశారని ఆయన దుయ్యపట్టారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు పట్టం కట్టేందుకు అందరూ సిద్ధం కావాలని అయన పిలుపునిచ్చారు.

'సీపీఐతోనే సమస్యల పరిష్కారం'

కొయ్యూరు, జనవరి 10: మన్యంలో సీపీఐ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతున్నాయని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని అంతాడ పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో పార్టీ సీనియర్ నేత బన్నిన మల్లయ్య 17వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో మన్యంలో సీపీఐకి పూర్వ వైభవం సమకూర్చితేనే గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అనకాపల్లి జిల్లా కార్యవర్గ సభ్యుడు గురుబాబు, గొలుగొండ మండల కార్యదర్శి ఎం.సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ఉల్లి సత్యనారాయణ, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సతీష్, వ్యవసాయ, కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నానాజీ, సర్పంచ్ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితునికి సాయం

జి.మాడుగుల, జనవరి 10: మండలంలోని గడుతూరు పంచాయతీ పచ్చనపల్లి గ్రామానికి చెందిన కూడా కోటేశ్వరరావు కుటుంబ సభ్యులకు హెల్పింగ్ హేండ్స్ సేవ సంఘం ప్రతినిధులు బుధవారం ఆర్థిక సాయం అందించారు. కోటేశ్వరరావు ఇల్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిబూడిదైన విషయం తెలిసందే. దీంతో హెల్పింగ్ హేండ్స్ సభ్యులు బుధవారం పచ్చనపల్లి వెళ్లి బాధిత కుంటుంబానికి నగదు, నిత్యావసర సరకులు, దుస్తులు అందజేసి ఆదుకున్నారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థుడి వైద్య సేవల కోసం కొంత నగదును అందించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు గసాడి తిరుపతిబాబు, లక్ష్మణ్, కె.అప్పరావు మాస్టారు, ఎం.సింహాచలం, రాజకీయ నాయకులు ఎం.అప్పరావు, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నా.. పండగ ఎలా చేసుకుంటాం?'

చింతపల్లి, జనవరి 10: మూడు నెలలుగా వేతనాలు పంపిణీ చేయకపోతే పండగ ఎలా చేసుకుంటాం జగనన్నా అంటూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ర్యాలీ చేపట్టారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో ఉప తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ వేతనానికి పని భారంతో పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులపై వైసీపీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం దారుణమన్నారు. పెరిగిన ధరలకు తగినట్టుగా నిర్వాహణ ఖర్చులు చెల్లించడం లేదన్నారు. వేతనాలు కూడా సకాలంలో చెల్లించడం లేదన్నారు. ప్రస్తుతం మూడు నెలలుగా నిర్వాహకులకు వేతనాలు మంజూరు కాలేదన్నారు. సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తున్నామంటూ గొప్పగా ప్రకటనలు చేసే జగన్మోహన్‌రెడ్డికి, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల ఆవేదన పట్టదా? అని ప్రశ్నించారు. ఇప్పటికైన నిర్వాహకులకు వేతనాలు చెల్లించాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షులు పసుపులేటి లక్ష్మి, అధ్యక్షురాలు పద్మ, నాయకురాలు మినుములు జ్యోతి పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సంఘటిత ఉద్యమాలు అవసరం

- సీపీఐ జిల్లా అధ్యక్షుడు పొట్టిక సత్యనారాయణ

చింతపల్లి, జనవరి 10: హక్కుల సాధనకు సంఘటిత ఉద్యమాలు అఅవసరమని సీపీఐ జిల్లా అధ్యక్షుడు పొట్టిక సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సీపీఐ నాయకులు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సీపీఐ నిత్య పోరాటం చేస్తున్నదన్నారు. ప్రజా బలంతోనే సీపీఐ ముందుకు సాగుతున్నదన్నారు. ప్రధానంగా గిరిజన ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలను అడ్డుకోవడంలో ప్రధాన భూమిక పోషించిందన్నారు. యర్రవరం జలపాతంపై కూడా ఇదే స్ఫూర్తితో పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా కార్యదర్శి బిమలమ్మ, మండల కార్యదర్శి పేట్ల పోతురాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ రహిమాన్, పార్టీ సీనియర్ నాయకులు మఠం సూరిపడాల్, కామేశ్వరరావు, గోపాలరావు, అప్పలనాయుడు, యర్రబొమ్మలు సెగ్గె సత్యనారాయణ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

సెక్టార్ అధికారుల విధులు కీలకం

- పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్

అరకులోయ, జనవరి 10: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల విధులు కీలకమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం అరకు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని సెక్టార్ అధికారులతో ఎన్నికల విధులు, బాధ్యతలు, పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ అధికారుల ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను ముందుగా సందర్శించి, అక్కడ మౌలిక సదుపాయలపై నివేదికలు అందించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈవీఎంలు, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బందిపై అవగాహన ఉండాలని చెప్పారు. పాఠశాలలు, ప్రభుత్వ భవనాలలో మాత్రమే పోలింగ్ ప్రక్రియ జరగాలని స్పష్టం చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి సమాచారం అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు సకాలంలో ఓటింగ్ యంత్రాలను చేర్చడం, తిరిగి సకాలంలో స్ట్రాంగ్ రూంలకు చేర్చడంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వేణుగోపాల్, నియోజకవర్గ పరిధిలోని సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో జిల్లా కార్యదర్శి తనిఖీలు



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వెంకటరావు

డుంబ్రిగుడ, జనవరి 10: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆ శాఖ జిల్లా కార్యదర్శి వెంకటరావు బుధవారం తనిఖీలు నిర్వహించారు. గ్రంథాలయ పనితీరుపై రికార్డులను పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో అనేక రకాల పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు ఉన్నత విద్యకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రంథాలయాలు అన్ని వర్గాల వారికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఉన్నత విద్యాభ్యాసం, ఉద్యోగాల కోసం ప్రయత్నించే వారికి ఇవి చాలా ఉపయోగకరమన్నారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు సంబంధించి అన్ని రకాల పోటీల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగ పరుచుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఖాశా గ్రంథాయల అధికారిణి సునీత, ఓఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేయాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ రాజశేఖర్

పాడేరు రూరల్, జనవరి 10: ఢిల్లీలో ఈ నెల 12వ తేదీన నిర్వహించే పార్లమెంట్ మార్చ్ కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఏఐఎస్ఎఫ్‌తో పాటు 16 విద్యార్థి సంఘాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యా వ్యవస్థను కాపాడుకొనేందుకే పార్లమెంట్ మార్చ్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి అన్ని విద్యార్థి సంఘాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

కనీస వేతనాల కోసం భోజన కార్మికుల ఆందోళన



మండల విద్యా శాఖ కార్యాలయ ఎందుట నినాదాలు చేస్తున్న కార్మికులు

హుకుంపేట, జనవరి 10: కనీస వేతనాలు చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు బుధవారం ఆందోళనకు దిగారు. ముందుగా మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీ చేసి విద్యా శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ ఎస్.కొండలరావు మాట్లాడుతూ భోజన పథకం కార్మికులకు ప్రభుత్వం తొమ్మిది నెలలుగా కనీసం వేతనం ఇవ్వకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆరోగ్య కార్డులు అందించి ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అప్పలకొండ, కిల్లో రామారావు, లక్ష్మణ్, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై మొండి వైఖరి సరికాదు

- సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు



సమ్మె శిబిరంలో గడ్డి తంటూ నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

పాడేరు రూరల్, జనవరి 10: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మాత్రమే అమలు చేయాలని కోరుతూ 22 రోజులుగా సమ్మె బాటపట్టిన చిరుద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంబించడం సరికాదని సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.అనిల్‌కుమార్, వి.జయరాజ్ ఆవేదన వవ్యక్తం చేశారు. 22వ రోజు సమ్మె శిబిరంలో గడ్డి తింటూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి పర్మినెంట్ చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే హెచ్ఆర్‌పీ పాలసీ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగ సంఘం నాయకులు పి.సింహాచలం, గౌరీశంకర్, వెంకటరమణదొర, సుభద్ర, అనంతలక్ష్మి, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

చురుగ్గా 'రా.. కదలిరా' కార్యక్రమం ఏర్పాట్లు

- టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర



సభా స్థలంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న దొన్నుదొర, నాయకులు

అరకులోయ, జనవరి 10: మండల కేంద్రంలో ఈ నెల 20న జరగనున్న తెలుగుదేశం పార్టీ రా...కదిలిరా కార్యక్రమానికి చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నామని పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర చెప్పారు. సభా స్థలంలో జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అరకు నియోకవర్గ పర్యటనను విజయవంతం చేసేందుకు తెదేపా శ్రేణులు ఐక్యంగా పనిచేస్తున్నాయని చెప్పారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని చెప్పారు. రా...కదిలిరా సభకు హాజరయ్యేందుకు ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సభకు ఎన్నడు చూడని విధంగా గిరిజన ప్రజానీకం హాజరుకాబోతున్నారని దొన్నుదొర తెలిపారు. టీడీపీ పట్ల గిరిజన ప్రజలు సద్భావనతో ఉన్నారని, ఎవరికి వారుగా సభ కార్యక్రమ ఏర్పాట్లలో పాల్గొంటున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు మండలాల పార్టీ అధ్యక్షులు సుబ్బారావు, బలరాం, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మూర్తి, పెదబయలు ఎంపీపీ కొండయ్య, మాజీ ఎంపీపీ దన్నెరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు భాస్కరరావు, నాయకులు చిన్ని, అప్పారావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో ఉద్రిక్తత

- తీవ్రరూపం దాల్చిన పెదగంగవరం రైతుల ఆందోళన
- ట్యాంకు ఎక్కి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరిక
- పెట్రోల్ క్యాన్‌తో రామాలయంలో స్వీయ నిర్బంధం
- టీడబ్ల్యూఅధికారులు వేధింపులు ఆపాలని డిమాండ్
- ఆందోళనకారులతో చర్చలు జరిపిన అధికారులు
- పాడేరు ఎస్డీసీ హామీతో ఆందోళన విరమణ



రైతులతో చర్చలు జరుపుతున్న పోలీసులు

దేవరాపల్లి, జనవరి 10: రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తమను వేధిస్తున్నారంటూ అనంతగిరి మండలం పెదగంగవరం రైతులు ఇక్కడ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలు బుధవారం తీవ్రరూపం దాల్చాయి. కొంతమంది రైతులు వాటర్ ట్యాంకు ఎక్కగా, మరికొందరు రామాలయంలోకి వెళ్లి, తలుపులు బిగించి నిర్బంధించుకున్నారు. అధికారులు వేధింపులు ఆపకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటూ హెచ్చరించారు. దీంతో దేవరాపల్లిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ పెదగవగవరం గ్రామానికి చెందిన సుమారు 300 కుటుంబాల వారు దాదాపు వందేళ్ల నుంచి తరతరాలుగా భూములను సాగుచేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని చెప్పారు. కానీ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు 1/70 చట్టం పేరుతో తమ సాగులో వున్న భూములను ఆన్‌లైన్ చేయకుండా వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఉన్నతాధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో దేవరాపల్లి వచ్చి మూడు రోజుల నుంచి ఆందోళన చేస్తున్నట్టు చెప్పారు. కాగా భూములను ఆన్‌లైన్ చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటూ పెట్రోల్ క్యాన్‌తో రామాలయంలోకి వెళ్లి, తలుపులు వేసుకొని నిర్బంధించుకున్నారు. మరికొంతమంది సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు ఎక్కి నిరసనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్.ఐ.నాగేంద్ర, ఇన్‌చార్జ్ సీఐ కుమారస్వామి, తహసీల్దార్ ఎం.లక్ష్మి, చోడవరం అగ్నిమాపక శాఖ అధికారులు ఇక్కడకు వచ్చారు. వాటర్ ట్యాంకు దిగి తమ సమస్యలు చెప్పుకోవాలని సూచించారు. ఉన్నతాధికారులు వచ్చి సమాధానం చెప్పే వరకు కిందకు దిగేది లేదని రైతులు స్పష్టం చేశారు. దీంతో జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పాడేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శర్మ.. గురువారం రైతులతో చర్చలు జరుపుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



వైసీపీ కార్యకర్తలకు కండువాలు పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమేష్‌నాయుడు

ఎగువ మోదాపుట్టులో టీడీపీలోకి వైసీపీ కార్యకర్తలు

పాడేరు రూరల్, జనవరి 10: మండలంలోని కుజ్జెలి పంచాయతీ ఎగువమోదాపుట్టు గ్రామంలో బుధవారం 50 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ గ్రామంలో పార్టీ నేత కిల్లో వెంకట రమేష్‌నాయుడు బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేసే అరు గ్యారంటీల పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే సీఎం జగన్ పాలనలో గిరిజన ప్రాంత ప్రజలకు జరిగిన అన్యాయాలను వివరించారు. అనంతరం బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీలో కుటుంబాలను రిజిస్ట్రేషన్ చేయించారు. గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఏకతాటిపైకి వచ్చి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉల్లి రామారావు, ఎ.నరసింహమూర్తినాయుడు, ఎం.వెంకటేశ్వర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పెదబయలు విద్యుత్ సబ్ స్టేషన్ సందర్శించిన ఎస్ఈ



సబ్ స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్ఈ

పెదబయలు, జనవరి 10: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో విద్యుత్ వినియోగం వివరాలను అడిగి తెలుసుకున్నారు. మారుమూల గ్రామాలలో విద్యుత్ సరఫరా, తదితర అంశాలపై సిబ్బందితో సమీక్షించారు. ప్రధానంగా అడుగులపుట్టు పంచాయతీలోని జంగంపుట్టు గ్రామంలో విద్యుత్ సదుపాయం లేని ఆదివాసీల గృహాలను తనిఖీ చేశారు. ప్రతీ గృహంలో నూతనంగా విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేయాలని ఏఈ రాంబాబుకు ఆదేశించారు. అలాగే విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ముంచంగిపుట్టు, జనవరి 10: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంఘం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో చేపట్టిన దీక్షలకు గిరిజన సంఘం, సీఐటీయూ నాయకులు ఎం.ఎం.శ్రీను, కె.శంకరావు, సర్పంచ్ కె.త్రినాథ్ తదితరులు మద్దతు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో జగన్ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరితే, వారిపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం సిగ్గుచేటని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఉద్యమాన్ని అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆపేదిలేదని వారు తేల్చిచెప్పారు.

సర్కారు బెదిరింపుల పర్వం!

... 5వ పేజీ తరువాయి

పేర్కొంటున్నారు. అంగన్‌వాడీలు షోకాజ్ నోటీసులకు ఇచ్చే జవాబుల ఆధారంగా వారిపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. అయితే ప్రభుత్వం ఇచ్చే షోకాజ్ నోటీసులు సంక్రాంతి పండగకు జగన్.. అక్కాచెల్లెమ్మలకు ఇచ్చే తాంబులాలు అంటూ బుధవారం ఇక్కడి దీక్షా శిబిరంలో మోకాళ్లపై నిల్చొని ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఆందోళనలు చేస్తున్నా తమ సమస్యలపై కనీసం దృష్టి సారించకుండా కేవలం బెదిరింపులు, దౌర్జన్యాలతో ప్రభుత్వం తమ ఉద్యమాన్ని తొక్కేయాలని చూడడం సరికాదని అంగన్‌వాడీలు మండిపడుతున్నారు. తమకు న్యాయం జరిగే వరకు సమ్మెను విరమించబోమని హెచ్చరిస్తున్నారు. చింతపల్లిలో అంగన్‌వాడీలు బుధవారం వినూత్న నిరసన తెలిపారు. తలపై చెంగు వేసుకుని భారీ ర్యాలీ నిర్వహించారు. డుంబ్రిగుడలోని యూనియన్ బ్యాంకు సమీపంలో జాతీయ రహదారిపై గిరిజన సంప్రదాయ నృత్యం థింసాను ప్రదర్శిస్తూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు.

క్రైం... crime news

బాలికపై అత్యాచారం కేసులో
ఇద్దరి అరెస్టు

» అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ వెల్లడి

చింతపల్లి, జనవరి 10: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలోని ఒక గిరిజన గ్రామంలో పదకొండేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్ తెలిపారు. సబ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల రెండో తేదీ ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను అదే గ్రామానికి చెందిన పాంగి రమేశ్ (19) చేయి పట్టుకుని పక్కనే ఉన్న ఇంట్లోకి లాక్కెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడన్నారు. ఈ విషయం బాలిక బయటకు చెబుతుందనే భయంతో తన స్నేహితుడు గెమ్మెలి సీతన్నతో కలిసి హత్య చేయాలని నిర్ణయించుకున్నాడన్నారు. గంటల వ్యవధిలోనే బాలిక ఇంట్లోకి వెనుక నుంచి ప్రవేశించారని, ఆమె రక్షించుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఛాతీపై రమేశ్ బలంగా తన్నడంతో కింద పడిపోయిందన్నారు. బాలికను చంపే ముందు రమేశ్, సీతన్న అత్యాచారం చేశారన్నారు. అనంతరం గొంతు నులిమి చంపి, దూలానికి చున్నీతో ఉరి వేసుకున్నట్టుగా సీన్ చిత్రీకరించి వెళ్లిపోయారన్నారు. పొలం నుంచి ఇంటికి వచ్చిన బాలిక తల్లిదండ్రులు...కుమార్తె ఉరి వేసుకుని ఉండడం చూసి కన్నీరుమున్నీరుగా విలపించి మరుసటిరోజు సమాధి చేశారన్నారు. అయితే బాలికను రమేశ్ చేయిపట్టుకుని పక్క ఇంట్లోకి తీసుకువెళ్లడాన్ని చూసిన చుట్టుపక్కల పిల్లలు విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు చెప్పారని, దీంతో వారు ఈ నెల ఐదో తేదీన జీకే వీధి పోలీసులకు ఫిర్యాదు చేశారని అదనపు ఎస్పీ వివరించారు. ఈ మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు ఆరో తేదీన వైద్యులు, రెవెన్యూ అధికారులతో గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేయించినట్టు చెప్పారు. అత్యాచారం జరిగిందని, ఆపై హత్య చేశారని పోస్టుమార్టం నివేదికలో నిర్ధారణ జరిగిందని చెప్పారు. దీంతో నిందితులు రమేశ్, సీతన్నలపై అత్యాచారం, హత్య, పోక్సో చట్టాల కింద కేసు నమోదు చేశామన్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచామన్నారు. ఈ సమావేశంలో సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మృతి

అచ్యుతాపురం, జనవరి 10: మండలంలో బుధవారం జరిగిన వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మృతిచెందారని సీఐ బుచ్చిరాజు, ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. హరిపాలేనికి చెందిన రైతుకూలి సియాద్రి తాతబ్బాయి(57) తిమ్మరాజుపేటలోగల చెరుకు తోటలో పనిచేయడానికి వెళ్లి పాము కాటుకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలించేలోగా మృతిచెందాడు. ఇతని కుమారుడు గణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. అలాగే దొప్పెర్ల పంచాయతీ సబ్బవరపు కొంపలుకి చెందిన సబ్బవరపు నాగేంద్ర(32) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి రెండేళ్ల క్రితం వివాహం కాగా, 8 నెలల పాప ఉంది. దీనిపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలి

» ఏఐవైఎఫ్ అధ్యక్షుడు కన్నబాబు డిమాండ్



నెహ్రూచౌక్‌లో నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

తుమ్మపాల, జనవరి 10 : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని ఏఐవైఎఫ్ అధ్యక్షుడు కన్నబాబు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ నాయకులతో కలిసి బుధవారం పట్టణంలోని నెహ్రూచౌక్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి నీళ్లతో అభిషేకం చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఎన్నికల ముందు చేపట్టిన పాదయాత్రలో నిరుద్యోగులకు హామీలు ఇచ్చి విస్మరించారని ఆరోపించారు. పరిశ్రమల మంత్రి హోదాలో ఉన్న గుడివాడ అమర్‌నాథ్ రాష్ట్రానికి ఏ ఒక్క పరిశ్రమను తీసుకు రాలేదని ఆరోపించారు. ఏఐవైఎఫ్ నాయకులు వియ్యపు రాజు, రేఖా సంతోష్, భరిణికాన సాయి, బోరా రాజేష్, ఒమ్మి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

విశాఖపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు గురువారం ఉదయం పది గంటలకు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరుగుతాయని సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. ఉదయం 10 గంటలకు రెండు, 10.30 గంటలకు ఐదు, మధ్యాహ్నం 12 గంటలకు 4, 6, మూడు గంటలకు 1,3,7 స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు.

అప్పన్న సన్నిధిలో సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు

» దర్శన వేళల్లో స్వల్ప మార్పులు

సింహాచలం, జనవరి 10: సింహాచలం దేవస్థానంలో సంక్రాంతి సంబరాలకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మాడవీధులను రంగవల్లులతో శోభాయమానంగా తీర్చిదిద్దడంతో పాటు పల్లె వాతావరణం ఉట్టిపడేలా పూరి గుడెసెలు నిర్మిస్తున్నారు. అలాగే భోగి మంట వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భోగి రోజున సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య అప్పన్న ఆలయంలో గోదారంగనాథుల కల్యాణం జరగనుంది. ఆ రోజు ఉదయం జరగాల్సిన స్వామివారి నిత్య కల్యాణం కూడా సాయంత్రం చేయనున్నారు. 15న మకర సంక్రాంతి పురస్కరించుకుని ఉత్తరాయన పుణ్యకాలం ప్రత్యేక పూజలు జరగనుండడంతో ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య భక్తులకు దర్శనాలు లభించవు. కనుమ రోజున సాయంత్రం కొండ దిగువన స్వామివారి ఉద్యానవనంలో గజేంద్రమోక్షోత్సవం జరగనుంది. ఆ రోజు సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే దర్శనాలు లభిస్తాయి. 6 తరువాత నుంచి మరుసటి రోజు ఉదయం ప్రభాత ఆరాధనల తరువాత యథావిధిగా భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. ఆలయంలో పలు వార్షికోత్సవాలు జరగాల్సి ఉండడంతో ఈనెల 11 నుంచి 17 వరకు ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నామని, సాయంత్రం 7 గంటల వరకు మాత్రమే దర్శనాలు లభిస్తాయని ఈఓ చెప్పారు. అలాగే ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 12న కూడారై ఉత్సవం పురస్కరించుకుని ఉదయం 8.30 నుంచి 9. 30 గంటల వరకు దర్శనాలు నిలిపివేస్తామని చెప్పారు.

కిరండోల్ రైళ్లు జగదల్‌పూర్ వరకే

విశాఖపట్నం, జనవరి 10: కేకే లైనులో దంతెవాడ- కామలూర్ స్టేషన్ల మధ్య భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ, కిరండోల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్లను విశాఖ, జగదల్‌పూర్ మధ్య నడిపించనున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 18514 నంబరు గల నైట్ ఎక్స్‌ప్రెస్, 08551 నంబరు గల డే ఎక్స్‌ప్రెస్ ఈనెల 10,11వ తేదీల్లో విశాఖ నుంచి జగదల్‌పూర్ వరకు...తిరుగు ప్రయాణంలో 18513 నంబరు గల నైట్ ఎక్స్‌ప్రెస్, 08552 నంబరు గల డే ఎక్స్‌ప్రెస్ ఈనెల 11, 12వ తేదీల్లో జగదల్‌పూర్‌లో బయలుదేరి విశాఖ చేరుతాయని పేర్కొన్నారు. జగదల్‌పూర్-కిరండోల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	70.00
లైవ్ ధర	90.00
విత్ స్కిన్	150.00
స్కిన్ లెస్	160.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

గోదాదేవి నీరాటోత్సవాలు


నీరాటోత్సవాల్లో భాగంగా గోదాదేవి అమ్మవారి తిరువీధి సేవ

నక్కపల్లి, జనవరి 10: ఉపమాక క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంతో బుధవారం గోదాదేవి అమ్మవారి నీరాటోత్సవాలను ఆలయ అర్చకులు ఘనంగా ప్రారంభించారు. ముందుగా గోదాదేవి అమ్మవారిని ఆలయానికి ఆనుకుని వున్న పుష్పతోటలోకి తీసుకు వెళ్లారు. ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, సాయి గోపాలాచార్యులు ప్రత్యేక పూజలు చేసి, తిరుప్పావై పాశుర విన్నపం చేసి హారతులిచ్చారు. అనంతరం రాజాధిరాజ వాహనంలో గోదాదేవి అమ్మవారిని అలంకరించి తిరువీధి సేవ చేశారు.

ఉపమాకలో నగర సంకీర్తన

కాకినాడ జిల్లా కత్తిపూడికి చెందిన సుమారు 200 మంది భక్త బృందం బుధవారం ఉదయం ఉపమాక క్షేత్రానికి వచ్చి, మేలుకొలుపు ఉత్సవంలో భాగంగా మాడవీధుల్లో నగర సంకీర్తన చేశారు. కత్తిపూడి వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ కేలంగి నూకరాజు, హరినాథ్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది భక్తులు ఉపమాక వచ్చారు. శివాలయం చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు తదితరులు వారికి ఘన స్వాగతం పలికారు.

సింహాద్రి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

» టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల



టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామరాజును సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు

పరవాడ, జనవరి 10: సింహాద్రి ఎన్టీపీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల రఘురామరాజు హామీ ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి చిత్తూరు జిల్లా కుప్పం వరకు తలపెట్టిన కార్మిక చైతన్యయాత్ర బుధవారం సింహాద్రి మెయిన్‌గేటు వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనకు టీఎన్‌టీయూసీ, టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రఘురామరాజు మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షలు బీమా వర్తించేలా చూస్తానన్నారు. స్పెషల్ అలవెన్సు చెల్లింపులతో పాటు ఈఎస్ఐ అమలు జరిగేలా యాజమాన్యంతో మాట్లాడుతానన్నారు. కార్మికులపై వేధింపులకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయనను టీఎన్‌టీయూసీ, టీడీపీ నాయకులు కలిసి ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాసవరపు అప్పలనాయుడు, రొంగలి గోపాలకృష్ణ, ఇందల కొండలరావు, వియ్యపు చిన్న, పైలా వరలక్ష్మి, శివలంక లక్ష్మి, పార్వతి, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై నిలదీత

» మండల సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన సభ్యులు


ఇసుక అక్రమ తవ్వకాలపై అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

కోటవురట్ల, జనవరి 10: వరహా నదిలో రేయింబవళ్లు ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని అధికారులను జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు సూర్యారావు నిలదీశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉమాదేవి, సూర్యారావు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులకు మామూళ్లు ఇస్తున్నామని ఇసుక తరలించే టైరు బండ్ల యజమానులు బహిరంగంగా చెబుతున్నా ఎందుకు స్పందించడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల పంట పొలాలు, వంతెన దెబ్బతినే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కొళాయి ఏర్పాటు పనుల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల నాణ్యత లేకుండాపోయా యన్నారు. సన్యాసిరాజుపాలెం ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు హరికృష్ణ పాఠశాలకు వస్తున్నారో?, రావడం లేదో? తెలియడం లేదని ఎప్పుడూ స్కూల్‌కు తాళాలు వేసి ఉంటున్నా యని ఎంఈవోకు టీకే పల్లి ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు ఫిర్యాదు చేశారు. తమ గ్రామానికి సురక్షిత తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులను చౌడువాడ సర్పంచ్ గోపాలం కోరారు. ఎంపీటీసీ సభ్యుడు సూర్యారావు మాట్లాడుతూ రంగు మారిన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోవడం లేదని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాగా ఈ సమావేశానికి వైస్ ఎంపీపీ చెక్కా సుజాత, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరుకాకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ సమావేశంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ తీర్మానం లేకుండా సీసీ రోడ్డు నిర్మాణం

» నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక సంఘం నిధులు వినియోగం
» ఎంపీడీవోను నిలదీసిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు


ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలతో మాట్లాడుతున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథం

కోటవురట్ల, జనవరి 10: గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా ఆర్థిక సంఘం నిధులతో మండల పరిషత్ ప్రాంగణంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఎలా ఇచ్చారంటూ సర్పంచ్ బి.అనిల్‌కుమార్, జడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి, వైసీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేశ్ బుధవారం ఎంపీడీవో కాశీవిశ్వనాథంను నిలదీశారు. మండల పరిషత్‌కు 15వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధుల నుంచి రూ.4.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్న విషయం తెలుసుకుని వారు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. గ్రామపంచాయతీ తీర్మానంతోపాటు ఎస్టిమేషన్, వర్క్‌ఆర్డర్ లేకుండా పనులు ఎలా మొదలుపెట్టారని ప్రశ్నించారు. ఆర్థిక సంఘం నిధులను నిబంధనల ప్రకారం తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ పనులకు వినియోగించాలి. ఇందుకు విరుద్ధంగా సీసీ రోడ్డు నిర్మాణానికి వినియోగించడంపై ప్రజాప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం దీనిపై మండల ఇంజనీర్ వర్మను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. సీసీ రోడ్డుకు ఎస్టిమేషన్ వేసి, వర్క్ ఆర్డర్ అనుతులతోనే పనులు చేయిస్తుమన్నారు. పంచాయతీ తీర్మానం కోసం ఎంపీడీవో లేఖ ఇచ్చారని చెప్పారు.

పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 10: జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. శంకరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు చేస్తూ పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను అనుసరించి ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రతి విషయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. బూత్‌స్థాయి అధికారులు తప్పిదాలకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది రాజకీయ పార్టీల నమ్మకం కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో దయానిధి, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తునిలో చంద్రబాబు సభకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు


పాయకరావుపేట నుంచి తరలివెళుతున్న టీడీపీ శ్రేణులు

పాయకరావుపేట, జనవరి 10: కాకినాడ జిల్లా తునిలో బుధవారం జరిగిన 'రా కదలిరా.. తెలుగుదేశం పిలుస్తోంది' బహిరంగ సభకు పాయకరావుపేట నుంచి టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పాల్గొన్న ఈ సభకు టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో పాయకరావుపేట పట్టణంతో పాటు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. వీరిలో పార్టీ నాయకులు పల్లా విలియంకేరి, లెక్కల గోవిందు, వేములపూడి అప్పారావు, గుల్లా నాగరాజు, భాస్కర చౌదరి, ఆది, ఎం.దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...


టీడీపీలో చేరిన నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, జనవరి 10 : జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ సర్వనాశనమయ్యాయని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. కశింకోట మండలం కన్నూరుపాలెంలో బుధవారం వైసీపీ నుంచి పలువురు నాయకులు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నియంత పోకడలతో విసుగుపోయిన వైసీపీ నాయకులంతా టీడీపీ వైపు ఆసక్తి చూపుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాయల మురళీ, కూండ్రపు రామునాయుడు, కూండ్రపు అక్కునాయుడు, వర్రి పోతురాజు, సిరికి సన్యాసినాయుడు, కన్నూరు ఎర్రినాయుడు, సీహెచ్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'వాసుదేవరావు కుటుంబాన్ని ఆదుకుంటాం'

మునగపాక, జనవరి 10: సమగ్ర శిక్ష ఉద్యోగి వాసుదేవరావు కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల రఘురామరాజు అన్నారు. బుధవారం వాసుదేవరావు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. అనకాపల్లి డీఈవో కార్యాలయం ముందు దీక్ష చేస్తుండగా ఉద్వేగానికి లోనై వాసుదేవరావు బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చేరి మృతి చెందినా ప్రభుత్వం స్పందకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ.కిశోర్‌కుమార్, బి.శ్రీనివాసరావు, కర్రి లక్ష్మీనారాయణ, బొడ్డేడ అర్జునకృష్ణ, శంకరరావు, రాపేటి సత్తిబాబు, ఆళ్ల మహేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తాం

» అంగన్‌వాడీలకు బుద్ద నాగజగదీశ్వరరావు హామీ


అంగన్‌వాడీ శిబిరంలో మాట్లాడుతున్న నాగజగదీశ్వరరావు

అనకాపల్లి టౌన్, జనవరి 10: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు హామీ ఇచ్చారు. బుధవారం నెహ్రూచౌక్‌లో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీల శిబిరానికి ఆయన హాజరై వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అంగన్‌వాడీల వేతనాలు పెరిగాయన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ ఇచ్చిన మాటను తుంగలోకి తొక్కారన్నారు. అంగన్‌వాడీలకు అండగా తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ఉంటుందని, అధికార పార్టీ నాయకులు ఎవరైనా ఇబ్బందులు పెడితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగించి సమ్మెను నిషేధించడమంటే ప్రజా హక్కులపై దాడి చేయడమే అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆడారి కిశోర్‌కుమార్, కుప్పిలి జగన్మోహన్, మళ్ల గణేశ్, కాండ్రేగుల సత్యనారాయణ, పూడి రమణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె విరమించేది లేదు

» సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు


రిలే నిరాహారదీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

అనకాపల్లి రూరల్, జనవరి 10 : జిల్లాలోని అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమ్మె బుధవారానికి 30వ రోజుకు చేరింది. అంగన్‌వాడీల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 24 గంటల దీక్షను శంకరంలోని కలెక్టరేట్ వద్ద కొనసాగిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి అంగన్‌వాడీలు తరలివచ్చి దీక్షలో పాల్గొన్నారు. అనంతరం సుమారు 20 మంది అంగన్‌వాడీలు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీలు న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం సాగిస్తున్నారని, వాటి పరిష్కారానికి కృషి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వహిస్తున్నదని ధ్వజమెత్తారు. అంగన్‌వాడీలపై అత్యవసర సేవల చట్టం ఎస్మా ప్రయోగించడం అన్యాయమన్నారు. బుధవారం ఉదయం నుంచి ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చి విధులకు హాజరుకావాలని ఒత్తిళ్లు చేస్తున్నా సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని ఆయన తెలిపారు. ఈ దీక్షకు రావికమతం, మాడుగుల మండలాల అంగన్‌వాడీలు తరలివచ్చారు.

ప్రభుత్వం నుంచి స్పందన వచ్చే వరకు సమ్మె



నిరసన శిబిరంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

అనకాపల్లి రూరల్, జనవరి 10: జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమ్మె బుధవారానికి 22వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద వారు సమ్మెను కొనసాగించారు. మంగళవారం మృతి చెందిన వాసుదేవరావుకి సంతాపం తెలియజేస్తూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తట్టా కృష్ణ మాట్లాడుతూ సమ్మె ప్రారంభించి 22 రోజులు కావస్తున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం నుంచి సానుకూలమైన స్పందన వచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై జనసేన అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు, జనసేన శ్రేణులు

సబ్బవరం, జనవరి 10 : మండలంలోని పలు గ్రామాల్లో ఓటు వినియోగంపై ప్రజలకు అవగాహనకు జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల రమేష్‌బాబు బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఓటు వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందలి వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, గండి దుర్గాప్రసాద్, ఉగ్గిన రాము, ఎస్.రవి, కర్రి కనకరాజు, బలిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.